
నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 7 సెప్టెంబర్ 2024 | RANGAREDDY



వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్తున్న నిర్వాహకులు



చేవెళ్ల మార్కెట్ యార్డులో పారవేసిన టమాట

## ఆగమనం.. హంగామా

**అట్టహాసంగా గణపతి స్వాగతోత్సవాలు**
**డీజే శబ్దాలు, బ్యాండ్ బాజాలతో వెల్ కమ్**

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 6 : గణపతి నిమజ్జనం అంటే.. వెలుగులు జిగేల్‌మంటాయి.. డీజే సౌండ్‌లతో దద్దరిల్లుతాయి.. బ్యాండ్ బాజాలు కాలు కదిపేలా చేస్తాయి.. రంగురంగుల పేపర్లు గాల్లో నుంచి ఎగిరిపడుతుంటాయి.. ఉత్సాహంతో యువత కేరింతలు ఆకట్టుకుంటాయి.. గణపతి బప్పా మోరియా.. అంటూ నినాదాలతో భక్తిభావం వెల్లివిరిస్తుంది.. కానీ, ఇదంతా ఇప్పుడు గణపతి స్వాగతోత్సవాల్లోనూ కనిపిస్తున్నది. ఆగమనం అదుర్స్ అనేలా వినాయకుడి ప్రతిమలను తీసుకొచ్చే కార్యక్రమాన్ని ఆడంబరంగా నిర్వహిస్తున్నారు. ఖర్చు ఎక్కువైనా పర్లేదు.. కానీ తగ్గేదేలే అంటున్నారు. రెట్టించిన ఉత్సాహంతో గణపతులకు వెల్‌కమ్ చెబుతున్నారు.

**వేదిక వరకు వేడుకగా..**

వినాయక చవితి అంటేనే యువత పండుగ. నవరాత్రులు వేడుకలు జోరుగా సాగుతాయి. నిమజ్జనం మరింత అట్టహాసంగా సాగుతుంది. కానీ, ఇటీవల ఆగమన కార్యక్రమాన్నే అద్భుతంగా నిర్వహిస్తున్నారు. ఇందుకోసం నిర్వాహకులు ముందుగానే ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గణపతి ప్రతిమ కొనుగోలు మొదలు ప్రతిష్ఠాపన చేసే వేదిక వరకు ఓ పండుగ వాతావరణంలో తీసుకొస్తున్నారు. గణపతి ప్రతిమను బుక్ చేశాక.. తీసుకెళ్లే వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. విద్యుత్తు బల్బులు ఏర్పాటు చేస్తున్నారు. డీజేలు ఏర్పాటు చేసి లైటింగ్ మధ్య స్వాగతం పలుకుతున్నారు. స్థానికంగా వినాయకుడిని ప్రతిష్ఠించే స్థలానికి సమీపంలోని చౌరస్తా నుంచి ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. కొందరు వినాయకుడి విగ్రహం కొనుగోలు చేసిన ప్రాంతం నుంచే బ్యాండ్ మోతలు, నృత్యాలతో గణపతికి స్వాగతం చెబుతున్నారు. గణపతి విగ్రహాల కొనుగోలుకు రూ. 20 వేల నుంచి లక్ష వరకు పెడుతుండగా.. ఇంకొందరు ఆపైనే వెచ్చించి ప్రతిమలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే చాలామంది ముందస్తుగా ఆర్డర్లు ఇచ్చి తమకు నచ్చినట్టుగా విగ్రహాలను తయారు చేయించుకున్నారు. వాటి ఆగమనానికి రూ.వేలు వెచ్చిస్తున్నారు. ఆగమనం అద్భుతం అనేలా అనిపించుకోవాలనుకుంటున్నారు. వారం రోజుల ముందు నుంచే ఈ వినాయక ఆగమన కార్యక్రమాలు మొదలు కాగా, శుక్రవారం ఈ కార్యక్రమాలు మరింత ఊపందుకున్నాయి. గణపతి ప్రతిమల కొనుగోలు కేంద్రాల వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు సందడి సందడిగా మారింది. పలువురు విగ్రహాల కొనుగోలు కేంద్రాల వద్దే బ్యాండ్‌లు మాట్లాడుకుని ఊరేగింపు మొదలు పెట్టారు. ఇంకొందరు ఇప్పటికే బుకింగ్ చేసిన డీజేలు, బ్యాండ్‌లతో కలిసి ఊరేగింపు నిర్వహిస్తున్నారు. యువత పెద్ద ఎత్తున పాల్గొంటూ.. పండుగకు ముందే పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారు.



గుంతలమయంగా షాబాద్ మండలంలోని రుద్రారం రోడ్డు

# నష్టమెంత?

**రంగారెడ్డి జిల్లాలో నీట మునిగిన పంటలు**

**దెబ్బ తిన్న రహదారులు..కూలిన ఇండ్లు**
**నష్ట తీవ్రత లెక్కింపులో అధికారుల అంతులేని జాప్యం**

**ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో పంటలు నీటిపాలయ్యాయి. ఇండ్లు కూలిపోయి చాలామంది నిరాశ్రయులయ్యారు. విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. రోడ్లు నామరూపాల్లేకుండా దెబ్బ తిన్నాయి. దీంతో నడవలేం..వాహనాలను నడపలేం అన్నట్లుగా పరిస్థితి మారింది. అయితే జిల్లాలో 917 ఎకరాల్లో పంట నష్టం జరి గినట్లు వ్యవసాయ శాఖ చెబుతుండగా..తుది నివేదికను ఇంకా ఇవ్వలేదు. మిగతా శాఖలు సైతం నివేదికలను అందజేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయి. దీంతో నివేదికలు ఇచ్చేదెప్పుడు? ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టేదెప్పుడు..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క వర్షాలకు వీధులు చిత్తడిగా మారి పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని పల్లె, పట్టణ ప్రజానీకం ఆందోళన చెందుతున్నది.**
**- రంగారెడ్డి, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ)**

- 917 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా
- పారిశుధ్యం లోపించి కంపుకొడుతున్న పల్లెలు, పట్టణాలు
- సహాయక చర్యలు మృగ్యం
- వ్యాధులతో ఆందోళన చెందుతున్న ప్రజానీకం



చేవెళ్లలో అధ్వానంగా మారిన ఓ వీధి

జిల్లాలో వర్షాలకు జరిగిన నష్టాన్ని తేల్చడంలో వివిధ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నాయి. ప్రాథమిక పరిశీలనలో 40 వరకు ఇండ్లు కూలిపోగా, 107 విద్యుత్తు స్తంభాలు దెబ్బతినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. అలాగే షాద్‌నగర్-అయ్యవారిపల్లి రోడ్డు, కొందుర్గు- కొల్లూరు రోడ్డు, వెలమలతండా-తంగేడుపల్లి రో డ్లు దెబ్బతిన్నట్లు అంచనాకు వచ్చారు. అలాగే.. 917 ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అయితే అన్ని శాఖలు తుది నివేదికలను సమర్పించడంలో జాప్యం చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. శుక్రవారం సాయంత్రానికి కూడా కొన్ని శాఖల నివేదికలు జిల్లా అధికారులకు అందలేదు. వానకాలంలో జిల్లాలో అత్యధికంగా పత్తిని సాగు చేస్తుండగా... ఆ తర్వాతి స్థానంలో వరి ఉన్నది. ఎడతెరిపి లేకుండా ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటకే ఎక్కువ నష్టం వాటిల్లింది. అలాగే వరి, జొన్న, మొక్కజొన్న వంటి పంటలు సైతం నీటిలో మునిగిపోయాయి. రైతన్నల ఆరుగాలం శ్రమ నీటి పాలైం ది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం కోసం రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే వ్యవసాయ శాఖ అధికారులు ఓ వైపు క్రాప్‌బుకింగ్, రుణమాఫీ వంటి వా టితో బిజీగా ఉండడంతో తుది నివేదికను రూపొందించడంలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ఇతర శాఖలు సైతం జరిగిన నష్టాన్ని తేల్చకపోవడంతో ప్రభు త్వం తరపున చేపట్టే సహాయక చర్యల్లోనూ జాప్యం జరుగనున్నది.

**సీజనల్ భయం..**

ఓ వైపు వర్షాలు..మరోవైపు పంచాయతీల పాలన మొక్కుబడిగా సాగుతుండడంతో పల్లెలను వ్యాధులు చుట్టుముడుతున్నాయి. వర్షాలకు వీధులన్నీ బురదమయంగా మారాయి. చెత్తాచెదారం పేరుకుపోతున్నది. దీంతో పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. విష జ్వరాలతోపాటు డెంగీ కేసులూ అధిక సంఖ్యలో నమోదవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో వేల సంఖ్యలో వైరల్ ఫీవర్ కేసులు నమోదు అవుతుండగా.. డెంగీ కేసులు సైతం 200లకు చేరువలో ఉన్నాయి. పంచాయతీలను నిధుల కొరత వేధిస్తుండడంతో సకాలంలో సహాయక చర్యలు చేపట్టే పరిస్థితిలో ప్రత్యేక అధికారులు లేరు. వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడం.. పారిశుధ్య నిర్వహణ ఇలాగే ఉంటే.. పరిస్థితి చేయి దాటి పోయే ప్రమాదం ఉందని గ్రామీణ, పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బీటలువారిన షాబాద్ మండలంలోని చందనవెల్లి రోడ్డు

## ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక.. భవిత కేంద్రం, జడ్పీ ఉన్నత పాఠశాలల ఆకస్మిక తనిఖీ**



శంషాబాద్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డును పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఫలాలు అందరికీ అందేందుకు ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. శంషాబాద్ మండలంలోని భవిత కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ఉన్నపాఠశాలను రంగారెడ్డి కలెక్టర్ శశాంక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. అందుతున్న సదుపాయాలతోపాటు, కల్పిస్తున్న వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులంతా ఒలింపిక్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకున్నారా ? అని వాకబు చేశారు. బాగా చదివి పదవ తరగతిలో అధిక ఉత్తీర్ణతను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు శంషాబాద్‌లోని భవిత సెంటర్, మండల పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించినట్లు కలెక్టర్ తెలిపారు. భవిత సెంటర్‌ను జీఎంఆర్, ఇతర బీమా సంస్థల సాయంతో కొనసాగించడం జరుగుతున్నదని చెప్పారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్తు, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించొద్దు

- **వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**
- **భూసమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి**
- **పీరంపల్లి, లింగంపల్లి గ్రామాల్లో పర్యటన**

కులకచర్ల, సెప్టెంబర్ 6 : ప్రభుత్వ భూములు, ఆస్తులకు నష్టం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని పీరంపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటి.. అనంతరం గ్రామంలో సర్వేనంబర్ 709, 06లో ఉన్న సరిహద్దు భూ సమస్య అంశాన్ని స్థానికులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. అక్కడి నుంచి చౌడాపూర్ మండలం లింగంపల్లి గ్రామంలోని మ్యాకలోని చెరువు కట్టకు కొందరు గండి కొట్టారని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన స్వయంగా అక్కడికెళ్లి పరిశీలించారు. తమకు ఇబ్బంది కలుగుతున్నదని కొందరు చెరువుకట్టను తొల గించేందుకు యత్నించిన విషయాన్ని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఏదైనా సమస్య ఉంటే గ్రామస్తులందరూ కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని.. చెరువులు, కుంటలు ప్రభుత్వ వనరులని వాటికి నష్టం కలిగిస్తే సంబంధిత వ్యక్తు లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 1952లోనే చెరువుకట్ట ఉన్నట్లు నక్షలో ఉందన్నారు. దానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో చెరువుకట్టకు సంబంధించిన సర్వేను పూర్తి చేసి నివేదికను అందించాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో హబీబ్‌అహ్మద్, తహసీల్దార్ మురళీధర్, అధికారులు, రైతులు ఉన్నారు.



చౌడాపూర్ మండలం లింగంపల్లిలో మ్యాకలోని చెరువు వివరాలను తెలుసుకుంటున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



బంట్వారం ప్రధాన చౌరస్తాలో నడిచేందుకు వీలులేని స్థితిలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు



వికారాబాద్ మండల పరిధిలోని గోధుమగూడ గ్రామ సమీపంలో గుంతలమయంగా మారిన రోడ్డు

## అధ్వాన దారులు

- గతుకులమయంగా మారిన వికారాబాద్ జిల్లాలోని రోడ్లు
- పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా.. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బ తిన్న రోడ్లు
- ఇబ్బందుల్లో పాదచారులు, వాహనదారులు
- మరమ్మతులపై దృష్టి సారించని ప్రభుత్వం

**గత వారం, పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని రోడ్లు గతుకులమయంగా మారాయి. ఏ రోడ్డును చూసినా కంకర తేలి, గుంతలు పడి బురదమయంగా నడిచేందుకు వీలులేకుండా ఉన్నాయి. దీంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా గుంతలు పడిన రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.**

వికారాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): జిల్లాలో కురుస్తున్న వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఏ రోడ్డును చూసినా కంకర తేలి, గుంతలు పడి వర్షం నీరు నిలిచి బురదమయంగా మారాయి. అంతేకాకుండా కొన్ని ప్రాంతాల్లోని రోడ్లు వర్షపు నీటితో చిన్న కుంటలను తలపిస్తుండడంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో గుంతల రోడ్లపై అంబులెన్స్ డ్రైవర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సమయానికి రోగులకు దవాఖానలకు చేర్చ లేకపోతున్నారు. ప్రధానంగా వికారాబాద్-మోమిన్‌పేట వెళ్లే రహదారి, మోమిన్‌పేట-మర్పల్లి రోడ్డు, వికారాబాద్-కోట్‌పల్లి రోడ్డు, బొంరాస్‌పేట మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు, దౌల్తాబాద్ మండలంలోని రోడ్లు, తాండూరు-పెద్దేముల్ వెళ్లే రోడ్లు, మోమిన్‌పేట-శంకర్‌పల్లి వెళ్లే రోడ్లన్నీ పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడడంతో ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ లోని రోడ్లు అధ్వానంగా మారాయి. గ్రామాల్లో అయితే మరీ దారుణంగా తయారైంది. మండల కేంద్రాల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లతోపాటు గ్రామాల్లో అంతర్గత రోడ్లు ఎక్కడ చూసినా బురద, గుంతలతో దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో ఓ వైపు వర్షపు నీరు నిలవడం, బురద ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గుంతల రోడ్లకు పాలకులు మరమ్మతులు చేపట్టక పోవడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క రూపాయీ రోడ్ల అభివృద్ధికి ఖర్చు చేయకపోవడం గమనార్హం.



గోతులు పడిన వికారాబాద్ జిల్లాలోని తొరుమామిడి-కేసారం ఆర్‌అండ్‌బీ రోడ్డు